సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం। 26। జనవరి। 2025

ప్రగతి బాటలో పయనం

రాజ్యాంగమే ఆలంబనగా అందివస్తున్న పథకాలను జిల్లా వాసులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గిరిజనులు రుణాలు, పథకాలతో ఆర్థికాభివృద్ధి సాధిస్తుండడంతో పాటు పలుచోట్ల బంగారు పంటలు పండిస్తున్నారు. నేడు రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..

8లో



న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. ఆలయంలో పూజల అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళాలు

ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదానానికి శని వారం పలువురు భక్తులు విరాళా లను అందచేశారు. ఏపీలోని గుడివాడకు చెందిన సర్వసూరి శాస్త్రి-రామలక్ష్మి దంపతులు రూ.1.50లక్షలు, ఖమ్మం జిల్లా మధిరకు చెందిన వెంకటేశ్వర్లు-సుగుణవతి రూ.1,00,116ను ఆలయ అధికారులకు అందచేసి స్వామిని దర్శించుకున్నారు.

ఐటీడీఏ పీఓకు స్పెషల్ అవార్డు

- గవర్నర్ చేతుల మీదుగా స్వీకరణ



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పీఓ

భద్రాచలం: జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో శనివారం జరిగిన వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ స్పెషల్ అవార్డు అందుకున్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బెల్లంపల్లి లోక్‌సభ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా రాహుల్ విజయవంతంగా విధులు నిర్వర్తించారు. ఈ మేరకు అవార్డు ప్రకటించారు. ఈ సందర్భంగా రాహుల్‌కు ఐటీడీఏ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఢిల్లీకి ఆహ్వానం

సింగరేణి(కొత్తగూడెం): ఢిల్లీలో నేడు జరిగే రిపబ్లిక్ డే వేడుకలు తిలకించేందుకు హాజరు కావాలని పర్యావరణ పరిరక్షకుడు, సింగరేణి కార్మికుడు సూర్వి రాజశేఖర్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు శనివారం ఆయన భార్య కల్పన, కుమార్తె గాయత్రితో కలిసి ఢిల్లీ బయలుదేరారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ తాను చేపట్టిన హరిత దీక్ష సేవలను గుర్తించిన ప్రభుత్వం మన్‌కీ బాత్ కార్యక్రమానికి ఆహ్వానించిందని తెలిపారు. సింగరేణి సంస్థ నుంచి తొలిసారి తనకు ఈ అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు.

జాతీయ సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న సంతోష్‌కుమార్

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు పాండిచ్చేరిలో జరిగిన దక్షిణ భారత సైన్స్ ఫేర్‌లో ఇల్లెందు సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థి సంతోష్‌కుమార్ రూపొందించిన స్మార్ట్ రెగ్యులేటర్ అనే ఎగ్జిబిట్‌కు బహుమతి దక్కింది. వంటగదిలో గ్యాస్ సిలిండర్ లీక్ అయితే వెంటనే ఫోన్‌కు సమాచారం రావడమే కాకుండా ఆటోమెటిక్‌గా ఆఫ్ అయ్యేలా ఈ రెగ్యులేటర్ ఉపయోగపడుతుంది. దీన్ని రూపొందించిన సంతోష్‌కుమార్‌కు సైన్స్‌ఫేర్ నిర్వాహకులు బహుమతి అందజేశారు.

పోలీస్.. సేవలు భేష్ !

ఆదివాసీల విద్య, వైద్యానికి సహకారం

- వెనుకబాటుకు నిలయమైన వలస జీవులకు భరోసా..
- మారుమూల ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమానికి బాటలు
- శాంతిభద్రతలతో పాటు సంక్షేమంలోనూ ఖాకీల అండ

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశ వ్యాప్తంగా 76వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరుగుతున్న ఈ తరుణంలోనూ కొందరికి విద్య, వైద్యం వంటి అత్యవసరాలు అందని ద్రాక్షగానే మిగిలాయి. ముఖ్యంగా వలస ఆదివాసీ గ్రామాల్లో ఈ తరహా పరిస్థితులు కొట్టొచ్చినట్టుగా కనిపిస్తున్నాయి. వ్యాధుల బారిన పడిన వారిని జెట్టీలపై వాగులు, వంకలు దాటిస్తూ ఆస్పత్రులకుగ తీసుకెళ్లే దృశ్యాలు ఇక్కడ సర్వసాధారణం. మిగతా ప్రపంచమంతా ఇంటర్నెట్‌తో బిజీగా ఉంటే ఇక్కడ అక్షరాలు చదవడమే కష్టమనే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఇప్పుడా పరిస్థితిలో మార్పు తెచ్చే దిశగా ప్రభుత్వ విభాగాలు ప్రయత్నిస్తున్నాయి. వాటికి తోడుగా పోలీసు శాఖ తన వంతు బాధ్యత నిర్వర్తిస్తోంది.

కురిసే పైకప్పు.. అతిథుల్లా పాములు..

చర్ల మండలం బూరుగుపాడు గ్రామానికి రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం ప్రత్యామ్నాయ పాఠశాల(ఆల్టర్నేట్ స్కూల్) మంజూరు చేసింది. ఆ గ్రామ సమీపంలో కర్రలతో పందిరి వేసి అక్కడే బడి నిర్వహించారు. ఆ తర్వాత మండల పరిషత్ పాఠశాల మంజూరైంది. అయితే రిజర్వ్ ఫారెస్ట్ అనుమతుల సమస్య కారణంగా పక్కా భవనం నిర్మించే అవకాశం లేకపోయింది. దీంతో రోడ్డే లేని ఈ బడికి పంతుళ్లు, పిల్లలు చేరుకోవడమే కష్టం. ఇబ్బందులు పడి వచ్చినా చిల్లులు పడిన పందిరి కింద వర్షం చినుకులు సమస్యగా మారేవి. అక్కడికీ ఓర్పుగా ఉంటే అడవుల్లోంచి పాములు, తేళ్లు వంటి విష పురుగులు పందిరి కిందికి చేరి విద్యార్థులను ఇబ్బంది పెట్టేవి. దీంతో ఈ స్కూలు ఒక రోజు నడిస్తే వారం రోజులు బంద్ అనే పరిస్థితి ఉండేది ఒకప్పుడు.

బడి బాగు చేయించండి..

గ్రామాల్లో గాలింపు చర్యలకు వచ్చిన పోలీసులకు బూరుగుపాడు ప్రజలు తమ పిల్లలు చదువుకునేందుకు పడుతున్న ఇబ్బందులను తెలిపారు. కనీసం



చర్ల మండలం బూరుగుపాడులో కొత్త స్కూలు భవనం (ఇన్‌సెట్) పాత స్కూలు

వానాకాలంలో కురవకుండా పందిరి మీద షీట్లు వేయించాలని కోరారు. అయితే అక్షరాలు నేర్చుకునేందుకు అక్కడి ప్రజలకు ఉన్న మక్కువను చూసిన పోలీసులు రంగంలోకి దిగారు. ఆ స్కూలుకు పక్కా భవనం, కరెంటు, ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు, ఎల్‌ఈడీ టీవీ వంటి సౌకర్యం కల్పించారు. ఈ మార్పు కేవలం పాఠశాలకు సంబంధించిన సౌకర్యాల విషయంలోనే కాదు.. అక్కడికి వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ కనిపించడం మొదలైంది. 18 మందిగా ఉన్న ఈ పాఠశాల విద్యార్థుల సంఖ్య ఇప్పుడు 45కు చేరుకుంది. ఉపాధ్యాయులు క్రమం తప్పకుండా వస్తున్నారు. వెరసి చదువుకోవాలనుకునే ఇతర ఆదివాసీలకు బూరుగుపాడు బడి ఆదర్శంగా మారింది.

ఆధునిక ఆస్పత్రి.. ఆటస్థలం

ఆదివాసీలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లా పోలీసులు ప్రయత్నిస్తున్నారు. చర్ల మండలం చెన్నాపురం గ్రామంలో ఈ మేరకు ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి చేశారు. అంబులెన్స్, సీటీ స్కాన్, అల్ట్రా స్కాన్ వంటి పరికరాలకు ఆర్డర్లు పెట్టారు. అవి అందుబాటులోకి రాగానే ఆధునిక వైద్య సేవలు ఈ ప్రాంత ప్రజలకు చేరువవుతాయి. రెగ్యులర్ వైద్యులు, ఇతర సిబ్బంది వచ్చే వరకు సమీపంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ క్యాంపు డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది ఇక్కడ పని చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఉత్సాహం ఉరకలు వేసే యువత ఇతర ఆలోచనల వైపు మళ్లకుండా ఉండేందుకు దుమ్ముగూడెం మండలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పోలీసు శాఖ చేపడుతోంది. ఇది కూడా త్వరలో అందుబాటులోకి రానుంది.

వారి వద్దకే వైద్య సేవలు



గొత్తికోయలు ఉన్న చోటుకే వైద్య సేవలు తీసుకెళ్లాలని నిర్ణయించాం. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులు రూ.2 కోట్లతో ఆస్పత్రి నిర్మిస్తున్నాం. ఇది అందుబాటులోకి వస్తే బట్టిగూడెం, చెన్నాపురం, పూసుగుప్ప గ్రామాలకు ఉపయోగకరంగా ఉంటుంది. – రోహిత్‌రాజ్, ఎస్పీ

ప్రజల భాగస్వామ్యంతోనే



ఫీల్డ్ విజిట్‌లో బూరుగుపాడు వెళ్లినప్పుడు అక్కడి ప్రజలు స్కూలు బాగుచేయమని కోరారు. దీంతో ఆ ఊరి ప్రజలను భాగస్వాములను చేస్తూ పాఠశాల నిర్మాణానికి, ఇతర సదుపాయాలకు మా వంతు సహకారం అందించాం. – రాజువర్మ, చర్ల సీఐ

రామయ్య సన్నిధిలో ఐఏఎస్ అధికారి

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని డైరెక్టర్ ఆఫ్ ఫిషరీష్, సివిల్ సప్లయీస్ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రియాంక ఆల శనివారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తుల వద్ద పూజలు చేశారు. అనంతరం ఆమెకు ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనం, ప్రసాదాలు, జ్ఞాపిక అందచేశారు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన ప్రియాంక.. ఆలయ ఉద్యోగులను పలకరించారు. భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ బుద్దా నర్సింహారావు, ఆలయ ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో..

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని ప్రియాంక ఆల కుటుంబసభ్యులతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా డీర్‌పార్కులో దుప్పులను, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం జలాశయంలో బోటింగ్ చేశారు.



కిన్నెరసానిలో బోటింగ్ చేస్తున్న ప్రియాంక ఆల

తల్లిదండ్రులకు పాదాభివందనం



తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

టేకులపల్లి: మండలంలోని బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం మంగీలాల్, స్కూల్ హెచ్‌ఎం జ్యోతిరాణి మాట్లాడుతూ.. పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థులు రూపొందించిన బోధనోపకరణాలతో ప్రదర్శన నిర్వహించారు. ఉత్తమ తల్లిదండ్రులకు సన్మానాలు చేసి, విద్యార్థులతో పాదాభివందనం చేయించారు. ఉత్తమ తల్లులకు కిరీట ధారణ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ పొగాకు లక్ష్మి ఉత్తమ తల్లిదండ్రులకు బహుమతులు అందజేశారు. టీచర్లు జర్పల పద్మ, ఐఆర్పీ టీచర్ నీరజ షారోన్ పాల్గొన్నారు.

మళ్లీ పులి కలకలం !

అటవీ ప్రాంతంలో సీసీ కెమెరాకు చిక్కిన టైగర్..

కరకగూడెం: మండలంలో మళ్లీ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. డిసెంబర్ 12న మండలంలోని రఘునాథపాలెం అటవీ ప్రాంతంలో సంచరించిన పులి అదే నెల 18న ములుగు జిల్లా అటవీ ప్రాంతంలోకి వెళ్లింది. తాజాగా శనివారం మళ్లీ మండలంలోకి రాగా, సీసీ కెమెరాలో ఆ దృశ్యాలు కనిపించాయి. దీంతో అప్రమత్తమైన అటవీ అధికారులు పలు గ్రామాల్లో దప్పు చాటింపు వేయించి, 10 రోజుల వరకు ప్రజలెవరూ అటవీ ప్రాంతాల్లోకి వెళ్లొద్దని సూచించారు. పులికోసం జాడ కోసం బృందాలుగా ఏర్పడి అడవులను జల్లెడ పడుతున్నట్లు మణుగూరు డీఎఫ్‌ఓ మక్సుద్ మొహినొద్దీన్ తెలిపారు.



సీసీ కెమెరాకు చిక్కిన పెద్దపులి

క్షణికావేశంలో తప్పులు చేయొద్దు

భద్రాచలంఅర్బన్ : క్షణికావేశంలో చేసే తప్పిదాలతో జీవితాలు నాశనమవుతాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్ అన్నారు. భద్రాచలం సబ్ జైలులో రిమాండ్ ఖైదీలకు శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఖైదీలు ఇక నుంచైనా సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబించాలని, విరామ సమయంలో పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. జీవనానికి అవసరమైన వృత్తులపై అవగాహన పెంచుకోవాలన్నారు. నేరారోపణ ఎదుర్కొంటున్న రిమాండ్ ఖైదీలు ప్రభుత్వం నుంచి న్యాయ సేవలు పొందే అవకాశం ఉందని చెప్పారు. జైలులో ఖైదీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వంటగది, భోజనశాల, మరుగుదొడ్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి భానుమతి, భద్రాచలం సబ్ జైల్ సూపరింటెండెంట్ ఉపేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదానం, న్యాయవాదులు నవీన్, సతీష్, శారద, సంధ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వసంత్ పాటిల్

స్వేచ్ఛగా ఓటు వేయాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): పౌరులంతా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక పోస్టాఫీస్ సెంటర్‌లో మానవహారం, ఆ తర్వాత కొత్తగూడెం క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. జాతి, మతం, వర్గం, భాష తదితర ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డును కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, డీఎల్ ఎంటీ పి.సాయికృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, ఆర్డీఓ మధు, డీఎస్పీ రెహమాన్, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి, ఎలక్షన్ సెల్ తహసీల్దార్ దారా ప్రసాద్, సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ తహసీల్దార్లు శిరీష, కృష్ణ, ప్రసాద్, వివేక్ పాల్గొన్నారు.



ర్యాలీ సందర్భంగా బెలూన్లు వదులుతున్న కలెక్టర్

గ్రామసభలు విజయవంతం..

జిల్లాలో గ్రామసభలను విజయవంతంగా నిర్వహించామని కలెక్టర్ పాటిల్ తెలిపారు. నేటి నుంచి ప్రారంభించనున్న నాలుగు పథకాల అమలుపై సీఎస్ శాంతికుమారి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీసీలో ఆయన మాట్లాడారు. నాలుగు పథకాల అమలుపై జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రేషన్ కార్డులకు 45,332, ఇందిరమ్మ ఇళ్లకు 38,369, రైతు భరోసాకు 1,121, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 15,672 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డి. వేణుగోపాల్, విద్యాచందన, డీఏఓ బాబురావు పాల్గొన్నారు.

సింగరేణిలో ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలో ఉత్తమ ఉద్యోగులు, కార్మికులను ఎంపిక చేశారు. గణతంత్రం దినోత్సవం సందర్భంగా ఆదివారం కొత్తగూడెంలో జరిగే వేడుకల్లో సీఎండీ బలరామ్ వీరిని సన్మానించనున్నారు. కార్మికుల విభాగంలో నోముల రవీందర్(ఎస్‌డీఎల్ ఆపరేటర్, భూపాలపల్లి), ధరంఢి తిరుపతిరావు(హెడ్ ఓవర్‌మెన్ ఆర్జీ-3), మేకల రమేష్ (ఎస్‌డీఎల్/హెచ్‌డీఎల్ ఆపరేటర్, ఆండ్రియాలా), కామ వెంకటేశ్వర్లు(ఈపీ ఆపరేటర్, జీడీకే ఓసీపీ-3), భూక్యా శంకర్(ఎస్‌డీఎల్ ఆపరేటర్, జీడీకే-1, 3), అదుమునూరి సుధాకర్(వెల్డర్, ఖైరీగూడ ఓసీ-3), సయ్యద్ అబ్బాస్(ఫోర్‌మెన్, శ్రీరాంపూర్), అటికమ్ శ్రీనివాస్(ఎస్‌డీఎల్ ఆపరేటర్, రవీంద్రఖని-5 ఇంక్లైన్), షేక్ ఖాదర్ బాబు(పిట్టర్, మణుగూరు), గిద్దలూరి నాగేశ్వరరావు(హెడ్ ఓవర్‌మెన్, కొత్తగూడెం), అజ్మీరా మోహన్(కెమిస్ట్, ఎస్‌టీపీపీ) ఉన్నారు. అధికారుల విభాగంలో వీవీఎస్‌కే.కిశోర్‌బాబు(ఎస్ఈ, కొత్తగూడెం), మోల్గా చిన్నయ్య(ఎస్ఈ, ఇల్లెందు), సలాగాల రమేష్(డీజీఎం, మణుగూరు), చిలక శ్రీనివాస్(ఏజెంట్, జీడీకే-1), కొండి శంకరయ్య (డీవై మేనేజర్, ఆర్జీ-2), టి.నాగేశ్వరరావు(ఎస్ఈ, ఆర్జీ-3), కన్నెపోగు శ్రీకాంత్(డీవైఎస్ఈ, ఆండ్రియాలా), కొక్కుల శంకర్(డిప్యూటీ సూపరింటెండెంట్, మందమర్రి), కనుకుంట్ల పూర్ణచందర్ (సీనియర్ అండర్ మేనేజర్, శ్రీరాంపూర్), కె.అరుణ్ (ఈఈ ఈ అండ్ ఎం ఎస్‌టీపీపీ), జీ.ఎస్.జానకీరామ్(జీఎం, కార్పొరేట్ ఏరియా), పి.రాజశేఖర్(డీవైజీఎం, కార్పొరేట్ ఏరియా)తోపాటు మల్లెల సుబ్బారావు (జీఎం, కార్పొరేట్ ఏరియా) ఎంపికయ్యారు.

'కొండరెడ్ల' యువతకు అరుదైన అవకాశం



గవర్నర్ చేతుల మీదుగా ఓటరు గుర్తింపు కార్డు అందుకుంటున్న యువతి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఎనిమిది కొండరెడ్ల గ్రామాల నుంచి 23 మంది యువతీ యువకులు కొత్తగా ఓటర్లుగా నమోదు కాగా, వారికి శనివారం హైదరాబాద్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గుర్తింపు కార్డులు అందించారు. వీరిలో రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఉమ్మల సరోజిని, యట్లా సందీప్ రెడ్డి ఉన్నారు.

ఉత్తమ బీఎల్‌ఓగా కృష్ణవేణి..

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం రైటర్ బస్తీ అంగన్‌వాడీ టీచర్ సామల కృష్ణవేణికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ బూత్ లెవెల్ ఆఫీసర్(బీఎల్ఓ) అవార్డు దక్కింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా సంక్షేమాధికారిణి, సీడీపీఓ ప్రోత్సాహం వల్లే తనకు అవార్డు దక్కిందని కృష్ణవేణి తెలిపారు.



అవార్డు అందుకుంటున్న కృష్ణవేణి

250 మీటర్ల జాతీయ జెండాతో ప్రదర్శన



భారీ జాతీయ పతాకంతో ర్యాలీలో విద్యార్థులు

భద్రాచలంఅర్బన్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భద్రాచలంలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్, నన్నపనేని మోహన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సంయుక్త ఆధ్వర్యాన 250 మీటర్ల పొడవైన జాతీయ జెండాతో శనివారం ప్రదర్శన నిర్వహించారు. జాతీయ జెండా విశిష్టత, దేశభక్తిని చాటు తూ నిర్వహించిన ఈ ప్రదర్శనలో విద్యార్థులు భారత్ మాతాకీ జై, జై జవాన్.. జై కిసాన్ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ మధుప్రసాద్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ, నెహ్రూ, పటేల్, నేతాజీ, అంబేద్కర్ వంటి ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంతోనే ఇప్పుడు స్వాతంత్ర ఫలాలు అనుభవిస్తున్నామని తెలిపారు. ఈనేపథ్యా న మహనీయుల త్యాగాలను విద్యార్థులంతా స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు మురళి, పాఠశాల హెచ్‌ఎం పులిపాటి రామకృష్ణ, ఉపాధ్యాయులు ధనకొండ శ్రీనివాసరావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత 'కాసాని' మృతి

- 20 ఏళ్లు సుజాతనగర్ సర్పంచ్‌గా సేవలు
- అయిలయ్య మృతికి పలువురి నివాళి



అయిలయ్య(ఫైల్)

సుజాతనగర్ : సీపీఎం రాష్ట్ర నాయకుడు, తొలి జిల్లా కార్యదర్శి కాసాని అయిలయ్య(75) తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ.. శుక్రవారం వరకూ పార్టీ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. డయాలసిస్ చేయించేందుకు కుటుంబసభ్యులు శనివారం కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లగా గుండెపోటుకు గురై మృతి చెందారు.

1974లో జిల్లాకు రాక..

వరంగల్ జిల్లా గీసుకొండ మండలం గంగదేవిపలిలో 1950 జూలై 8న జన్మించిన అయిలయ్య స్వగ్రామంలోనే ప్రాథమిక విద్య పూర్తి చేశారు. పీయూసీ కాజీపేటలో చదివారు. 1970లో ఓంకార్ అధ్వర్యంలో సీపీఎంలో చేరారు. 1971లో మేనమామ కూతురు లక్ష్మితో వివాహం జరగగా 1974లో సుజాతనగర్ మండలం రెడ్డిపాలెం గ్రామానికి వచ్చి ఆర్‌ఎంపీ వైద్యుడిగా కెరీర్ ప్రారంభించారు. 1978 నుంచి పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా పనిచేశారు. 1981లో సుజాతనగర్ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికై 2001 వరకు ఆ పదవిలో కొనసాగారు. జాతీయస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్నారు. 2013లో ఆయన సతీమణి కాసాని లక్ష్మి సర్పంచ్‌గా ఎన్నిక కాగా, ఆ పదవిలో ఉండగానే 2017లో ఆమె గుండెపోటుతో మరణించారు. జిల్లా విభజన తర్వాత తొలి జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

20 వేల మందికి ఇళ్లస్థలాలు..

పాల్వంచ నుంచి ఏన్కూరు వరకు సుమారు 20 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు అయిలయ్య అనేక పోరాటాలు చేశారు. జిల్లాలో పలు ఉద్యమాల్లోనూ క్రియాశీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో 23సార్లు జైలుకు వెళ్లారు. ప్రజాసమస్యలపై పలుమార్లు నిరాహార దీక్షలు సైతం చేపట్టారు. సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలపొద్దంటూ ప్రస్తుతం ఆయన ఉద్యమిస్తున్నారు. కాగా శనివారం నుంచి సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలకు వెళ్లిన పలువురు నేతలు అయిలయ్య మృతితో అక్కడి నుంచి వెనుదిరిగారు.

పార్టీ కార్యాలయంలో పలువురి నివాళి..

సింగరేణి(కొత్తగూడెం): అయిలయ్య మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు నివాళులర్పించారు. ఆదివారం సుజాతనగర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు తెలిపారు.

క్లుప్తంగా

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం


అధికారులకు సూచనలు చేస్తున్న ఏపీఓ డేవిడ్ రాజ్

భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏలో ఆదివారం జరిగే 76వ గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. శనివారం ఆయన విద్యార్థుల మార్చ్ ఫాస్ట్, రిహార్సల్, ఇతర పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సకాలంలో కార్యక్రమంలో పాల్గొనాలని చెప్పారు. అధికారులు సున్నం రాంబాబు, గోపాలరావు, చలపతి, తారాచంద్, నాగులు, వెంకటేశ్వరరావు, రమ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: మద్యం తాగి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రోహిత్ రాజు శనివారం సూచించారు. శుక్రవారం రాత్రి కొత్తగూడెం, భద్రాచలం, ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు తదితర ప్రాంతాల్లో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. శనివారం ఎస్పీ వివరాలు వెల్లడించారు. ప్రమాదాల నివారణలో భాగంగా తనిఖీలను నిర్వహించినట్లు తెలిపారు. ప్రతీ వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు.

ఉన్న వనరులతోనే ఉపాధి..

■ ఆర్థికంగా ఎదుగుతున్న ఆదివాసీ మహిళలు ■ బీడు భూముల్లో రెండు పంటలు పండిస్తున్న రైతులు ■ ఆదాయం పెంచుకుంటూ కుటుంబాల బలోపేతం

ఉద్యోగాలు రాలేదని పట్టభద్రులు.. రుణాలు ఇవ్వలేదని నిరుద్యోగులు నిత్యం ఆవేదన చెందుతుంటారు. పనిలో పనిగా పాలకులను తూలనాడుతుంటారు. కానీ 75 ఏళ్ల గణతంత్ర భారతావనిలో ప్రభుత్వ సాయానికి తోడు.. ఉన్న వనరులనే సద్వినియోగం చేసుకుంటూ.. జీవనోపాధి పొందుతున్నారు. మరికొందరికి పని కల్పిస్తున్నారు. వారిలో పట్టభద్రులూ, పట్టాలు లేనివారూ ఉన్నారు. ఏజెన్సీ ఆదివాసీ మహిళలు, గిరిజన రైతులు స్వశక్తితో ఆదాయం పొందుతున్నారు. సర్కారు నుంచి అందే సాయమే ఆలంబనగా ప్రగతి పథంలో పయనిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. గణతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా వారిలో కొందరి గురించి తెలుసుకుందాం.


సంప్రదాయ ముడిసరుకులతో లడ్డూలు తయారు చేస్తున్న గిరిజనులు

ఆదివాసీ సంప్రదాయ వంటలతో ఆదాయం..

భద్రాచలం: ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజన మహిళలు సమష్టిగా స్వయం ఉపాధి మార్గాల వైపు పయనిస్తున్నారు. అందుబాటులో ఉన్న వనరులనే సద్వినియోగం చేసుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెరిగిన నేపథ్యంలో గిరిజన మహిళలు మిల్లెట్స్‌తో వంటకాలు తయారు చేసి విక్రయిస్తున్నారు. జజ్జర్ల సమ్మక్క, ఊకా వెంకట కృష్ణ, వెంకటలక్ష్మి, తాటి లలిత, సోయం మంగవేణిలు గ్రూపుగా ఏర్పడి ఐటీడీఏ నుంచి రుణం పొంది చిన్నతరహా పరిశ్రమ ఏర్పాటు చేశారు. అది ఆశాజనంగా లేకపోవడంతో సామలు, రాగి, జొన్న వంటి ఆదివాసీ సంప్రదాయ పంటలతో భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ పేరుతో బిస్కెట్ల తయారీ మొదలుపెట్టారు. ఐటీడీఏ అధికారులు కార్యాలయ ఆవరణలోనే బిస్కెట్ల తయారీకి ఓ భవనంలో అవకాశం కల్పించారు. అమ్మకాలకు తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో షట్టర్ కేటాయించారు. దేవస్థానం వద్ద కూడా విక్రయాలు జరుపుతున్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు ఐటీడీఏ అధికారులు సహకరించాలని గ్రూప్ సభ్యురాలు జజ్జర్ల సమ్మక్క కోరుతోంది.

మిల్లెట్స్ టిఫిన్

గిరిజన యువతీ యువకులు ఆరోగ్య పరిరక్షణకు మిల్లెట్స్‌తో తయారు చేసిన అల్పాహారాన్ని అందించేందుకు 'న్యూట్రి మిల్లెట్ హబ్', అరకు కాఫీ పౌడర్‌తో కాఫీ 'కాఫీ హౌస్'ను భద్రాచలంలో ఏర్పాటు చేశారు. రాగి కుడుములు, జొన్న కుడుములు, కువిముల లడ్డూ, రాగి పకోడి, రాగి ఇడ్లీ, సజ్జల దోశ, జొన్న దోశ, జొన్న రోటీ, సామల దోశలను ఉదయం, సాయంత్రం వేళ విక్రయిస్తున్నారు. పీజీ పట్టభద్రుడైన పాయం రాజేంద్రప్రసాద్ ఆదివాసీ వంటలపై ఫెలోషిప్ సైతం తీసుకున్నాడు. 2017 నుంచి కోయ క్యూజన్ పేరుతో గిరిజన మహిళలు మడకం భారతి, మరో పది మంది సభ్యులతో కలిసి భద్రాచలంలో అల్పాహారం విక్రయిస్తున్నారు. అస్సాం టీ, అరకు, బెంగళూరు కాఫీ, ఇప్పపువ్వు టీ, కరకాయ టీలను ప్రజలకు, భక్తులకు అందుబాటులోకి తీసుకొని వచ్చారు. ప్రభుత్వ సాయం ఆశించకుండా స్వశక్తితో స్వయం ఉపాధి పొందుతున్నారు.


మిల్లెట్స్‌తో అల్పాహారం తయారు చేస్తున్న మడకం భారతి

మిల్లెట్ బిస్కెట్లు విక్రయిస్తున్న జజ్జర్ల సమ్మక్క



అటవీ ఉత్పత్తులతో..

గిరిజన మహిళలు కొంద్రు సుధారాణి, రామలక్ష్మి, అట్టం కమల, సిడియం కమల, వసుంధర, హర్షిణి, విజయ దుర్గా, శీలం దుర్గ ఓం శక్తి మల్టీ ప్రొడక్ట్స్ పేరిట ఓ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఏపీలోని చింతూరులో జరిగే సంతలో ఆదివాసీ సంప్రదాయ పంటలు, ఉత్పత్తులు కొనుగోలు చేసి, బయట ప్రపంచానికి విక్రయిస్తున్నారు. ఇప్పపువ్వు లడ్డూ, ఆనె గింజలు, నువ్వులు, రాగి లడ్డూలు తయారు చేసి విక్రయిస్తున్నారు. తేనె కూడా అమ్ముతున్నారు. అంబలి, కొవ్వొత్తులు, సర్ఫ్ తదితర వస్తువులను కూడా తయారు చేసి విక్రయిస్తున్నారు. మహాబీర గింజలు, తానికాయ, కుంకుడు కాయ తదితర గింజలను అమ్ముతున్నారు. ఆదివాసీ వంటలను భద్రాచలం వచ్చే వీఐపీలకు రుచి చూపిస్తున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూడకుండా అందుబాటులో ఉన్న వనరులను ఆదాయ మార్గాలుగా మార్చుకున్నారు. సీఆర్‌పీఎఫ్ వాళ్ల ద్వారా కొవ్వొత్తులు, ఫినాయిల్ తయారీలో తీసుకున్న శిక్షణ స్వయం ఉపాధికి దోహదపడిందని నిర్వాహకురాలు కొంద్రు సుధారాణి తెలిపారు.

బీడు భూముల్లో 'సౌర'భాలు..

- సోలార్ విద్యుత్ మోటార్లతో పంటల సాగు
- ఏటా రెండు పంటలు పండిస్తున్న 90 మంది రైతులు
- ఇందిరా జలప్రభ పథకంతో గిరిజనుల ఆర్థిక పరిపుష్టి

కొత్తగూడెంరూరల్: అది దట్టమైన అటవీ ప్రాంతం. మధ్యలో గిరిజన పల్లె. ప్రతీ ఒక్కరికీ రెండో, మూడో ఎకరాల భూమి ఉంది. కానీ సాగునీరు లేదు. భూమి ఉన్నా పంటలు పండించలేకపోతున్నామని అక్కడి గిరిజనులు ఆవేదన చెందుతుండేవారు. ఈ క్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా జల ప్రభ పథకం గురించి తెలుసుకున్నారు. సౌర్య విద్యుత్‌తో వ్యవసాయ పంపుసెట్లు ఏర్పాటు చేసుకుని ఏటా రెండు పంటలు పండిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం, బంగారు చెలక, తిప్పగుట్ట గ్రామాల్లో 90 మంది రైతులు 2017లో అప్పటి ఎమ్మెల్యే జలగం వెంకట్రావు చొరవతో సౌర విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో 12 మోటార్ల ఏర్పాటుకు రెడ్‌కో సంస్థ రూ.4.70 కోట్లు ఖర్చు చేయగా, రైతులు బోర్లు వేసుకుని సుమారు 200 మంది 750 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. గిరిజన రైతులు మూడ్ వీరభద్రం, వెంకటేశ్వర్లు గతేడాది చెరో నాలుగు ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. రూ. 5 లక్షలు పెట్టుబడిగా పెట్టగా అధిక ధర ఉండటంతో ఎకరానికి రూ.3.50 లక్షల ఆదాయం వచ్చిందని ఆనందంగా చెబుతున్నారా రైతులు. ఈ ఏడాది పంట కోత దశలో ఉందని పేర్కొన్నారు. సోలార్ పంపు సెట్ల ఆధారంగా బంగారు చెలక పంచాయతీలో తాటి బక్కయ్య మిర్చి పంట వేయగా, తాటి పొట్టయ్య మొక్కజొన్న పంట వేశారు. తిప్పగుట్ట పంచాయతీలో వజ్జ నారాయణ, సక్రు, బానోతు రమేష్ మిర్చి, మొక్కజొన్న సాగు చేశారు. ఒకప్పటి బీడు భూములు ఇప్పుడు సస్యశామలం కావడంతో గిరిజన రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

పిల్లలు ఉన్నత చదువులకు..



సూర్యరశ్మితో పని చేసే బోర్లతో ప్రతి సంవత్సరం పంటలు సాగు చేస్తున్నాం. గత సంవత్సరం నాలుగు ఎకరాల్లో మిర్చి వేశాను. మంచి ఆదాయం రావడంతో పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాను. ఈ ఏడాది మిర్చి కోయిస్తున్నారు. సోలార్ సిస్టమ్ లేనప్పుడు బీడు భూములు ఉండేవి. జలప్రభ మా పాలిట వరంగా మారింది. –మూడ్ వీరభద్రం, మైలారం

లాభాలు వస్తున్నాయి..



అప్పటి ఎమ్మెల్యే జలగం వెంకటరావు సహకారంతో బీడు భూములు నేడు కాసులు కురిపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం మిర్చి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాం. గతేడాది ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం వచ్చింది. టమాటాలు కూడా పండిస్తున్నారు. ఈ ఏడాది మొక్కజొన్న వేశాను. కంకులు బజార్‌లోకి పంపించి విక్రయిస్తున్నాము. లాభాలు వస్తున్నాయి.
– వజ్జా రాజు, రైతు


మైలారం పంచాయితీలో సోలార్ విద్యుత్ సాయంతో మిర్చి తోటకు బోర్ నీరు పడుతున్న రైతు

ఓ వైపు ప్రగతి..

- మరో వైపు పడిపోతున్న నైతికత
- సీనియర్ సిటిజన్ తాళ్లూరి పంచాక్షరయ్య


తాళ్లూరి పంచాక్షరయ్య

బూర్గంపాడు: అన్నివర్గాలకు సమాన హక్కులు, అభ్యున్నతి కోసం ఏర్పరుచుకున్న రాజ్యాంగానికి 75 ఏళ్లు నిండనున్నాయి. రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ప్రత్యక్షంగా ఆ సంబురాల్లో పాలుపంచుకున్న బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామానికి తాళ్లూరి పంచాక్షరయ్యకు ప్రస్తుతం 93ఏళ్లు నిండాయి. ఇప్పటికీ వ్యవసాయం చేస్తున్న ఆయన 'సాక్షి'తో శనివారం మాట్లాడుతూ పలు అంశాలను వెల్లడించారు. ఆ వివరాలు పంచాక్షరయ్య మాటల్లోనే..

అణగారిన వర్గాలకు ఊరట

రాజ్యాంగం అమలైన తొలి 25 ఏళ్లలో అణగారిన వర్గాలకు కొంతమేర ఊరట లభించింది. అప్పటి వరకు వెట్టిచాకిరీలో మగ్గిన వర్గాలు స్వశక్తితో జీవనోపాధులను మెరుగుపరుచుకున్నాయి. సంప్రదాయ వ్యవసాయ పంటల స్థానంలో మిర్చి, పొగాకు, పత్తి, పసుపు వంటి వాణిజ్య పంటల సాగు మొదలైంది. ఆ తర్వాత 25 ఏళ్లలో పంట దిగుబడులు పెంచుకునేందుకు ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరిగింది. దీంతో దిగుబడులు పెరిగిన వ్యవసాయ ఉత్పత్తుల్లో మందుల అవశేషాలు పెరుగుతున్నాయి. గత 25 ఏళ్లలో వ్యవసాయ రంగంలో శాస్త్ర సాంకేతికత మరింతగా పెరిగింది. దిగుబడులు గతంలో కంటే రెట్టింపు స్థాయికి చేరాయి. అదే సమయంలో పంట ఉత్పత్తుల్లో నాణ్యత, స్వచ్ఛత లోపించాయి. వ్యవసాయ రంగంలో 75శాతం మేర యాంత్రీకరణ మొదలైంది. వ్యవసాయ పనులకు కూలీల కొరత పెరుగుతోంది.

అనేక మార్పులు

విద్యారంగంలో చాలా మార్పులు వచ్చాయి. డిగ్రీలు, పీజీలు చదివిన వారికి కూడా నైతిక విలువల తెలియటం లేదు. చదువుకుని ఉద్యోగాలు సంపాదించి డబ్బు సంపాదించాలనే ఆతృత ప్రస్తుత యువతలో కనిపిస్తోంది. నేర ప్రవృత్తి పెరిగిపోతోంది. ప్రతీ ఒక్కరి లక్ష్యం డబ్బు సంపాదనే. అది నైతికమా... అనైతికమా అనేది ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో మోసాలు, నేరాలు పెరిగిపోతున్నాయి. ఒకరి ఎదుగుదలను మరొకరు ఓర్చుకునే పరిస్థితులు లేవు.

విలువలు దిగజారాయి

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పరిపాలన సాగుతోంది. స్వార్థ ప్రయోజనాల కోసం పాలకులు ఎంతకైనా తెగిస్తున్నారు. రాజకీయాల్లో, పరిపాలనలో నైతిక విలువలు పూర్తిగా దిగజారాయి. అధికారం కోసం అన్ని రాజకీయపక్షాలు అడ్డదారులు తొక్కుతున్నాయి. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు సమైక్యత స్ఫూర్తి కొరవడుతోంది. ప్రపంచంలో నైతిక విలువలకు భారతదేశాన్ని ఆదర్శంగా చెప్పుకుంటారు. ఇప్పుడ ఆ పరిస్థితి దిగజారకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉంది.

ముగ్గురు టీచర్లకు మెమోలు

టేకులపల్లి: సమయపాలన పాటించని ముగ్గురు టీచర్లకు డీఈఓ వెంకటేశ్వరాచారి శనివారం మెమోలు జారీ చేశారని కాంప్లెక్స్ హెచ్‌ఎం జోగ రవి తెలిపారు. గురువారం మండలంలోని చుక్కాలబోడు, జేత్యాతండా గ్రామాల్లోని పాఠశాలల ఉపాధ్యాయులు చందూలాల్, గురుప్రసాద్, హెచ్‌ఎం స్వామి విధులకు ఆలస్యంగా హాజరైన వైనంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు.

తల్లీకూతుళ్లు అదృశ్యం

చంద్రుగొండ : మండలంలోని మద్దుకూరుకి చెందిన తల్లీకూతుళ్ల అదృశ్యంపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన ఏసుమణి తన ఆరేళ్ల కుమార్తెతో ఈ నెల 3న ఉపాధి కోసం మణుగూరు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె తల్లి కాకిరాల మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రాక్టర్

దుమ్ముగూడెం : మండలంలోని నడికుడి గ్రామానికి చెందిన జగిడి అర్జున్ ట్రాక్టర్‌ను శనివారం డ్రైవర్ జగిడి దీపక్ భద్రాచలం తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలో భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపై విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి ట్రాక్టర్ మూడు ముక్కలైంది. అప్రత్తమైన డ్రైవర్ కిందకు దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ


విచారిస్తున్న ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను

గుండాల: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను శనివారం విచారణ చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన పల్లెపు జంపయ్య, వెంకన్నల మధ్య ఈ నెల 20న రాత్రి గొడవ జరిగింది. వెంకన్న తలపై కొట్టడంతో తలపగిలింది. దీంతో మరుసటి రోజు తండాకు చెందిన కొందరు పెద్దమనుషులను పిలిచి పంచాయితీ పెట్టారు. ఇద్దరికి నచ్చజెప్పే క్రమంలో మందలించారు. ఈ క్రమంలో జంపయ్య కోపోద్రిక్తుడై ఓ పెద్దమనిషిపై కత్తితో దాడిచేయగా చేతికి గాయమైంది. బాధితుల ఫిర్యాదు మేరకు ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను విచారణ చేపట్టారు. ఆయన వెంట సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళి ఉన్నారు.

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

ఎనిమిది మంది సభ్యుల్లో ఉమ్మడి జిల్లా వాసులు

వరంగల్ క్రైం: రూ.లక్ష అసలు కరెన్సీకి నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఈ ముఠాను వరంగల్ పోలీసులు అరెస్ట్ చేయగా వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా శనివారం వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజరకు చెందిన మణికాల కృష్ణ, నక్రిపేటకు చెందిన ధరమ్‌సోత్ శ్రీను, తేజావత్ శివ, ముల్కలపల్లి మండలం మూకమామిడికి చెందిన గుగులోత్ వీరన్నతో పాటు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం కేశవాపూర్‌కు చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్, ఉడుత మల్లేశ్, ఎర్రగొల్ల అజయ్, ఏపీలోని కర్నూలు జిల్లా కుర్విపేట మండలం వేల్పనూర్‌కు చెందిన బిజిని వేముల వెంకటయ్యను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో ప్రధాన నిందితుడైన మణికాల కృష్ణ గొర్రెల వ్యాపారం చేస్తుండగా ఆదాయం సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. గొర్రెల వ్యాపారంలో పరిచయమైన వ్యక్తులతో తనకు అడవిలో డబ్బుతో కూడిన డ్రమ్ము దొరికిందని, ఆ డబ్బు వినియోగిస్తే ఆరోగ్య, ఇతర సమస్యలు ఎదురవుతున్నాయని నమ్మించాడు. ఎవరైనా రూ.లక్ష ఇస్తే వారికి రెండింతల డబ్బు ఇస్తానని, అలాగే రూ.లక్ష అసలు ఇస్తే నాలుగు రెట్లు అధికంగా నకిలీ నోట్లు ఇస్తానని చెప్పేవాడు. ఆపై ఎర్రగొల్ల శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడగా కృష్ణకు తొలుత అసలు రూ.500నోట్లు చూపించడంతో మార్పిడి చేసేలా అంగీకారం కుదిరింది. ఆ డబ్బును హనుమకొండలో తనకు ఇవ్వాలని శ్రీనివాస్ సూచించగా కృష్ణ, మరో నలుగురు నిందితులతో కలిసి కారులో శుక్రవారం కేయూసీ ఔటర్ రింగ్ రోడ్డు వద్దకు వచ్చాడు. అక్కడ ఉన్న శ్రీనివాస్ మరో ఇద్దరు నిందితులతో కలిసి కరెన్సీ మార్పిడి చేసుకుంటుండగా పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకున్నారు. కారులో తనిఖీ చేయగా రూ.38.84లక్షల అసలు కరెన్సీ, రూ.21లక్షల నకిలీ నోట్లు, నకిలీ నోట్ల ముద్రణకు అవసరమైన కాగితాలు లభించడంతో విచారించగా నేరం అంగీకరించారు. ప్రధాన నిందితుడైన కృష్ణ ఇదే తరహాలో మరో మిత్రుడితో కలిసి తెల్లకాగితాలపై రూ.500 నోటు ముద్రించి పలుమార్లు మార్పిడి చేస్తూ పోలీసులకు చిక్కడంతో సత్తుపల్లి, వీ.ఎం.బంజర, లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైనట్లు సీపీ తెలిపారు.

విద్యుదుత్పత్తికి సమష్టిగా కృషి చేయాలి

పాల్వంచ: విద్యుదుత్పత్తికి ఉద్యోగ, కార్మికులు సమష్టిగా కృషి చేయాలని సీఈ పి.వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం కేటీపీఎస్ 7వ దశ సీఈ కార్యాలయంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(హెచ్-142) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్లను సీఈ ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రామారావు, ప్రధాన కార్యదర్శి కె.వెంకటరెడ్డి, ఎస్.శ్రీనివాసాచారి, డి.సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్.సయ్యద్, శ్రీహరి, నాగభూషణం, కోటేశ్వరరావు, శివరాం, ఉపేందర్, లక్‌పతి, రాములు, బాబూరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'డయాలసిస్' నిర్మాణ పనుల పరిశీలన

చర్ల: చర్ల ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేయనున్న డయాలసిస్ సెంటర్ నిర్మాణ పనులను శనివారం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు పూర్తి చేసి వచ్చే నెల 10వ తేదీ లోపు డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. రూ 1.40 కోట్లతో నిర్మించిన ఆస్పత్రి భవనం శ్లాబ్‌కు మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. వైద్యశాలలలో మందుల కొరత లేదని, పూర్తిస్థాయిలో మందులను అందుబాటులో ఉంచామని చెప్పారు. త్వరలోనే పూర్తిస్థాయిలో నర్సింగ్ స్టాఫ్‌ను నియమిస్తామని చెప్పారు. ఆయన వెంట చర్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సాయి వర్ధన్, వైద్య సిబ్బంది ఉన్నారు.